

కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. 2


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -64 శుక్రవారం 7 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డులు

**సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం**

**డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు**





**హైదరాబాద్ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 నుంచి 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పేదల కోసం కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. అది కూడా ఒకేసారి దాదాపు 1.05 కోట్ల కార్డులు ఇవ్వాలని భావిస్తున్నారు. గడచిన పదేండ్లలో కొత్త రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణలో దాదాపు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ఇప్పుడు ఇవ్వనున్న 1.05 కోట్ల కొత్త కార్డులు అదనం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడపాదడపా 19 లక్షల వరకు కొత్త తెల్లకార్డులు ఇచ్చింది. కొందరికి ఇచ్చి, మరికొందరికి ఇవ్వకపోవడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతూ వస్తున్నది. దీన్ని గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. మిగతా 2లో.



# రైతుల కోసం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

**కేంద్ర క్యాబినెట్ ఆమోదం -పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్**

**సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యంసీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర**

**కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం -గ్రామీణ ఉపాధి, పెట్టుబడులకు ఊతం**

**ఢిల్లీ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది.2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, మిగతా 2లో.

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

**వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్**

**యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం**

**ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు**

**పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం**




**ఢిల్లీ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు-2026'ను మిగతా 2లో.

# ఏపీ ప్రతిపాదన వెనక్కి

**పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్..**

**పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం**

**ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం**

**ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు**

**పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం**

**సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన**

**ఢిల్లీ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. మిగతా 2లో.



# దిశ బిల్లు ఉపసంహరణ

**ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు**

**దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లుల ఉపసంహరణ**

**యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం ఆమోదం**

**రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు**

**కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు**

**అమరావతి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపు**

**వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**

**అమరావతి,ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
పలు కీలక నిర్ణయాలకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మిగతా 2లో.




# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

**నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక**

**రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు**

**బొగ్గు రాకపై డిప్యూటీ సిఎం భట్టి ఆనందం**



# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1

**: పీఎంవో సమీక్షలో వెల్లడి**

**9 కీలక అంశాల ఆధారంగా కేంద్ర హోం శాఖ మూల్యాంకనం**

**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుకు ప్రత్యేక ప్రశంసలు**

**ఫిర్యాదుల కోసం 1930 నంబర్‌కు డయల్ చేయాలని ప్రజలకు సూచన**




**ఢిల్లీ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'ప్రగతి' సమీక్షలో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన మూల్యాంకనంలో ఈ విషయం వెల్లడైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరోల పనితీరును తొమ్మిది కీలక పారామితుల ఆధారంగా విశ్లేషించి ఈ ర్యాంకును ఖరారు చేసింది. స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సి) ఏర్పాటు, ఇ-జీరో ఎఫ్ఐఆర్ మిగతా 2లో.

# అసమానతలు ఉన్నంత కాలం రిజర్వేషన్లు కొనసాగాలి

**రిజర్వేషన్లను అంబేడ్కర్ దృక్పథంలో చూడాలని సూచన**


**లబ్ధి పొందిన వారు కోటా వదులుకోవాలని పిలుపు**

**రిజర్వేషన్లపై భగవత్ కీలక వ్యాఖ్యలు.**

**రిజర్వేషన్ల అమలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని హితవు**

**అసమానతలు తగ్గితే కోటా అవసరం తగ్గుతుందని వివరణ**

**ఢిల్లీ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
రిజర్వేషన్లపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే వాటి వల్ల ఇప్పటికే మిగతా 2లో.



# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

**ఎపి డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్ఎంబీ**

**తెలంగాణకు జై అనని**

**రేవంత్ సిఎంగా ఉన్నారు**

**జయశంకర్ ఆరాటం..కెసిఆర్**

**పోరటంతోనే తెలంగాణ సాకారం**

**జయశంకర్ జయంతి సందర్భంగా**

**నివాళి అర్పించిన హరీష్ రావు**

**సిద్దిపేట,ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ మిగతా 2లో.



## రైతుల కోసం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

**మొదటి పేజీ తరువాయి**

వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి.సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది.

కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది.సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

# ఏపీ ప్రతిపాదన వెనక్కి

**మొదటి పేజీ తరువాయి**

కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది.

ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.

రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1

**మొదటి పేజీ తరువాయి**

అమలు, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్ బాధితులకు తిరిగి నగదు ఇప్పించేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ వినియోగం, సహ్యోగ్-సమన్వయ పోర్టల్ల వాడకం, సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌ల పర్యవేక్షణ, సామర్థ్య పెంపుదల వంటి కార్యక్రమాల్లో కనబరిచిన అత్యుత్తమ పనితీరు ఆధారంగా తెలంగాణ ఈ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

దేశంలోనే తొలిసారిగా ూ4జ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పరిధిలోని కేంద్ర వేదికలను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక ప్రశంసలు అందుకుంది.

ప్రజలు ఎలాంటి సైబర్ మోసానికి గురైనా వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ సూచించింది. ఫిర్యాదుల పరిష్కారం, నష్టపోయిన డబ్బును తిరిగి పొందడంలో బాధితులకు సహాయం చేసేందుకు ప్రత్యేకంగా 87126 65600 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, సైబర్ బాధితులకు వేగంగా అండగా నిలవడం వంటి నిరంతర చర్యలే తెలంగాణకు ఈ ఘనతను సాధించిపెట్టాయి.

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

**మొదటి పేజీ తరువాయి**

లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది.ప్రస్తుతం యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది.ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది.అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.

ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

## అసమానతలు ఉన్నంత కాలం రిజర్వేషన్లు కొనసాగాలి

**మొదటి పేజీ తరువాయి**

సామాజికంగా, ఆర్థికంగా ఎదిగిన వారు స్వచ్ఛందంగా ఆ ప్రయోజనాలను వదులుకోవాలని సూచించారు.ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యువత అడిగిన ప్రశ్నలకు భగవత్ సమాధానాలు ఇచ్చారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఎంతకాలం కొనసాగాలనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ఈ అంశాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దృక్పథంలో చూడాలని అన్నారు.రిజర్వేషన్లు రాజకీయ కారణాలతో కాకుండా సామాజిక కారణాలతో అమల్లోకి వచ్చాయని భగవత్ చెప్పారు. సమాజంలో వివక్ష ఉన్నంత కాలం వాటి అవసరం ఉంటుందని తెలిపారు. సంక్షేమ చర్యలు నిజాయతీగా అమలు చేసి సామాజిక అసమానతలు తొలగించిన రోజే రిజర్వేషన్ల అవసరం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.రిజర్వేషన్ల ద్వారా ఇప్పటికే ఎదిగిన వారు తమ సమాజంలోని ఇంకా వెనుకబడిన వారికి అవకాశం కల్పించేలా కోటాను వదులుకోవాలనే ఆలోచనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాంటి ఆలోచన ఇప్పటికే కొందరిలో కనిపిస్తోందని చెప్పారు. అలాంటి భావనను ప్రోత్సహించాలని సూచించారు.రిజర్వేషన్ల అమలును రాజకీయాలకు అతీతంగా చూడాలని భగవత్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకోవడం వల్ల సమాజంలో విభేదాలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. వాస్తవానికి సామాజిక ఐక్యత కోసం తీసుకొచ్చిన వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు.ఇటీవల పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్లపై చర్చ మళ్లీ మొదలైన వేళ భగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

### కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం..

**ఢిల్లీ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**

జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌లపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు.

ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దీప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు.సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

**మంచిర్యాలఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**

సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపుర్ సింగరేణి థర్మల్

విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు.మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు

భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డులు

**మొదటి పేజీ తరువాయి**

**ఇవీ అర్హతలు**

తెల్ల రేషన్‌కార్డుకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు ఖరారు చేసింది. వీటి ప్రకారం అర్హులను గుర్తిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించే వారు అనర్హులు. కొత్తగా ఇచ్చే తెల్ల రేషన్‌కార్డుల్ని లామినేషన్ చేసి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ సబ్సిడీలతోపాటు ఉచిత బియ్యం కూడా లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి అయ్యింది. అలాగే ఆరోగ్య శ్రీ వైద్యసేవలకు కూడా తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఆరోగ్య శ్రీ వైద్యసేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డునే ప్రామాణికంగా గుర్తిస్తున్నారు.

**సుదీర్ఘ నిరీక్షణ**

ముఖ్యంగా తల్లిదండ్రుల రేషన్‌కార్డులో పేర్లు ఉన్న ఎంతో మంది యువతీయువకులు పెళ్లిళ్లు చేసుకున్నారు.




వారంతా ఆయా కుటుంబాలతో వేరపడ్డారు. చిన్న కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు కావాలని అభిలషిస్తున్నారు. పెండ్లిండ్లు చేసుకొని అత్తగారింటికి వెళ్లిన ఆడపిల్లల పేర్లు ఇప్పటికీ పుట్టింటి రేషన్‌కార్డుల్లోనే ఉన్నాయి. పేర్ల మార్పు, చేర్పులకు సవాలక్ష నిబంధనలు అడ్డుగా ఉండటంతో అందరికీ ఇబ్బందిగానే ఉంది. రేషన్‌కార్డులోంచి ఎవరిపేరన్నా తొలగిస్తే, మొత్తానికే కార్డు పోతుందనే భయంతో మరికొందరు అలాంటి ప్రయత్నాలు కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కొత్త కుటుంబాలకు భరోసాను ఇస్తున్నది.

**గ్రామీణంలో..:**గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని కూలీలు, పట్టణాల్లో అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు, కొత్తగా విడిపోయిన కుటుంబాలు, కొత్త పెళ్లిళ్లు జరిగిన జంటలు, ఇప్పటివరకు కార్డు లేని నిరుపేదలు కొత్త కార్డుల కోసం ఎక్కువగా ఎదురు చూస్తున్నారు. అలాంటి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెద్ద ఊరటనిస్తోంది. వారికి రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నారు.

**15న సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కొత్తరేషన్‌కార్డుల్ని అందచేస్తున్నదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆగస్టు 15న ఈ కార్యక్రమాన్ని సీఎం ఏ రేవంత్‌రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభిస్తారని వివరించారు. ఆ వెంటనే అన్ని నియోజకవర్గాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లాల యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారికి కొత్త కార్డులు ఇవ్వడంతో పాటు కొత్త దరఖాస్తుల్ని కూడా స్వీకరిస్తామని చెప్పారు. లబ్ధిదారుల జాబితాల (ఖరారు నుంచి కార్డుల ముద్రణ, (రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారుల్ని ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డులపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు ఓ (ప్రకటనలో తెలిపారు.----------------

# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు.గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా,ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులు కుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ÷ూఖాఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని హరీశ్ రావు తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఎ÷-లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

# దిశ బిల్లు ఉపసంహారణ

**మొదటి పేజీ తరువాయి**

దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహారించి.. మరింత పటిష్ఠ చట్టాల రూపకల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కేబినేట్ అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. మున్సిపల్ భూముల లీజు గడువు పెంపునకు చట్టసవరణల ప్రతిపాదన, యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. పాదచారుల భద్రత పాలసీ-2026, రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు,

అమరావతి క్యాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపునకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ట్విన్ టవర్స్ నిర్మాణ బాధ్యతలను ఎల్‌అండ్‌టీకి అప్పగించేందుకు అంగీకారం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు డిజైన్ల కోసం అదనపు నిధులు, అమరావతి భూ కేటాయింపులపై జీవోఎం సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు రీ-టెండర్లకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏదుల ముస్తూరులో 19.55 ఎకరాలు ఎపిఐఐసికి బదిలీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. తిమ్మసముద్రంలో 13.45 ఎకరాలు సియుడిఎకు బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా యుడిఎ పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని, వాటి సంఖ్య 21 నుంచి 23కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కండలేరు నుంచి పరిశ్రమల క్లస్టర్‌కు నీటి సరఫరాకు కేబినెట్ ఆమోద ముద్ర వేసిందన్నారు. విజయవాడ ఆటోనగర్ కాలనీవాసులకు జఆ÷ూ హక్కులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. 400 హౌసింగ్ యూనిట్ల భూ సమస్యకు కేబినెట్‌లో పరిష్కారం చూపామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ భూ వివాదాల పరిష్కారానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అమరావతి 'ఐ' ప్రాజెక్టుకు సవరించిన టెండర్లకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఎత్తైన అమరావతి ఐ నిర్మాణానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు 'అమ్నిబస్ చట్టం-2026' చట్టాన్ని తీసుకొచ్చామని, పెట్టుబడులకు అడ్డంకుల తొలగింపే అమ్నిబస్ చట్టం లక్ష్యమని పార్థసారథి స్పష్టం చేశారు. కుప్పం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు ప్రత్యేక పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. డి-ఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల పరిహారం అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అమరావతిలో 47 అంతస్తుల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ఆమోదం లభించిందని, ట్విన్ టవర్స్‌లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హైకోర్టు భవనం రీ-డిజైన్ ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఏపీ పిపిపి పాలసీ-2026కు మంత్రిమండలి నుంచి ఆమోదం ముద్ర పడినట్లు చెప్పారు. ఖఖఖ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడుల ఆకర్షణెళి కొత్త పిపిపి పాలసీ లక్ష్యమని తెలిపారు. మోతడకలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. హైస్పీడ్ రైలు, ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూముల సమీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 7 ఆగస్టు 2026

# కౌలు రైతులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలి

**ఎల్ఈసీ కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాలు అందించాలి**

**కలెక్టర్‌కు తెలంగాణ రైతు రక్షణ సమితి వినతి**



**హనుమకొండ/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో కౌలు రైతుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన 2011 కౌలు రైతుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు (ఎల్ఈసీ) జారీ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు సమితి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో వేలాది మంది కౌలు రైతులు ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నప్పటికీ, ఎల్ఈసీ కార్డులు లేక ప్రభుత్వ గుర్తింపుకు నోచుకోవడం లేదన్నారు. దీంతో పంట రుణాలు, పంట బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, ఇతర రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల చట్టం అమల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి కౌలు రైతుకు ఎల్ఈసీ కార్డులు జారీ చేయడంతో పాటు బ్యాంకుల ద్వారా పంట రుణాలు, బీమా సౌకర్యాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కౌలు రైతుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు, బ్యాంకుల సమన్వయంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, సురావు బాపూరావు, ఎర్రబెల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**బావుపేట పాఠశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అవగాహన కార్యక్రమం**




**ఎల్కతుర్తి/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సుమతి రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (ఎస్ఆర్ఐటిడబ్ల్యూ) ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు సూచించారు. ఎల్కతుర్తి మండలం బావుపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమాన్ని ఎస్ఆర్ఐటిడబ్ల్యూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డా. కె. మహేందర్ శర్మ ఆధ్వర్యంలో, రావుల శశికుమార్ రెడ్డి సమన్వయంతో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఐ. రాజశ్రీ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించే ఇటువంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. బావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ నాయక్ ఎన్ఎస్ఎస్ బృందాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా.. సంపూర్ణ ఆరోగ్యానికి పునాది

**తల్లి పాల వారోత్సవాల్లో అక్షరాభ్యాసం, అన్నప్రాశన, శ్రీమంతం**



**తల్లాడ/ఆగస్టు 6 (జర్నలిస్ వార్త):** పుట్టిన బిడ్డకు తల్లి పాలే అత్యుత్తమ ఆహారమని, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లి పాలు ఇవ్వడం ద్వారా శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతాడని ఐసీడీఎస్ సూపర్వైజర్ రోజాకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని గాంధీనగరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా బుధవారం అక్షరాభ్యాసం, అన్నప్రాశన, శ్రీమంతం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోజాకుమారి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లి పాల ప్రాధాన్యంపై సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అక్షరాభ్యాసం, అన్నప్రాశన, శ్రీమంతం వంటి కార్యక్రమాలను ఒకే వేదికపై నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి కుటుంబం తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అనిత, శాంతిరేఖ, వసంతరాణి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి.



**బయ్యారం,ప్రభాత వార్త,ఆగస్టు 6.**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన చింత సైదులు(50) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ ప్రశాంత్ బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం చింత సైదులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో తన వ్యవసాయ బావి వద్ద మోటార్ పైపును బిగించే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. సైదులుకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి, ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై మృతుడి అల్లుడు ధార సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రశాంత్ బాబు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు

**రాళ్లపాడు తండలో జలసిరి కార్యక్రమం**







**దామరచర్ల/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి, జల్ సంచయ్‌జన్ భాగిదారి, జల శక్తి అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా దామరచర్ల మండలం రాళ్లపాడు తండ గ్రామపంచాయతీలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ధీరావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను స్థానిక మొదటి వార్డు సభ్యుడు ధీరావత్ కోట నాయక్, ఏడో వార్డు సభ్యుడు రేవంత్ రెడ్డి (వంశీనాయక్), సర్పంచ్ కుమారుడు శ్రీధర్ నాయక్ పరిశీలించారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించేలా ఈ ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని, భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించేందుకు ఇవి దోహదపడతాయని వారు తెలిపారు. గ్రామంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# గ్రామాల నుంచే ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలి

**ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కమిటీల పునర్నిర్మాణానికి పిలుపు**



**హసన్‌పర్తి/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** అణగారిన వర్గాల హక్కుల సాధనకు గ్రామ స్థాయి నుంచి ఉద్యమాలను బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తడుగుల విజయ్ మాదిగ మాట్లాడుతూ.. దేశంలో కుల వివక్ష కారణంగా పీడిత వర్గాలు ఇంకా సామాజిక, ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయని అన్నారు. వారి అభ్యున్నతి కోసం గ్రామ స్థాయి నుంచి ప్రజా పోరాటాలను నిర్మించాలని, ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంపొందించాలని సూచించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల కమిటీలు రద్దైన నేపథ్యంలో కొత్త గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువతను ఉద్యమంలో భాగస్వాములను చేసి గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయాలని పిలుపునిచ్చారు.
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రూపొందించిన ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామాలకు వెళ్లి పనిచేయాలని, మండల, జిల్లా కమిటీలను త్వరగా పూర్తి చేసి ఉద్యమాన్ని విస్తరించాలని కోరారు.
సమావేశంలో ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు ఆరెపల్లి పవన్ మాదిగ, జిల్లా నాయకులు రాజారాపు బిక్షపతి మాదిగ, మేకల రమేష్ మాదిగ, బొక్క సాంబరాజు మాదిగ, రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ, నద్దునూరి ఆనందం మాదిగ, బోడ సాంబయ్య మాదిగ, బొక్క విజయ మాదిగ, అరేపల్లి నాగరాజు మాదిగ, బండారి భీమయ్య మాదిగ, ఎల్తూరి ఎల్లేష్ మాదిగ, ఆకునూరి అకిరానందం మాదిగ, ఎంజేఎఫ్ మండల అధ్యక్షుడు సందేలా రాజు, సందేలా త్రిశూల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సీపీఐ పాదయాత్రలు

**కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన -12 ఏళ్ల పాలనలో హామీలు నెరవేరలేదని విమర్శ**





**ఎల్కతుర్తి/ ఆగస్టు 6 (జర్నలిస్ వార్త):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలో చేపట్టిన పాదయాత్రలు బుధవారం ఎల్కతుర్తి, దామెర మండలాల్లో కొనసాగాయి. ఈ నెల 6న కాజీపేటలో ప్రారంభమైన పాదయాత్రలు 11వ తేదీ వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉట్కూరి రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది కోటి ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.
ప్రజా సమస్యలపై ప్రశ్నించినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం అసలు అంశాలను పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న నిరుద్యోగానికి పరిష్కారం చూపడంతో పాటు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పురం, ఇంద్రానగర్, చింతలపల్లి, దామెర, కొత్తపల్లి, ముల్కనూర్, గట్ల నర్సింగాపూర్, ముస్తాపూర్, కొత్తకొండ వరకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 11న హనుమకొండ వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ముగింపు సభ చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు నిమ్మల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 92వ జయంతి వేడుకలు**







**నర్సంపేట/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొ. మల్లం నవీన్ అన్నారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతిని రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. మల్లం నవీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలోని వివిధ దశల్లో ఆయన పోషించిన పాత్రను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎస్. కమలాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ భావజాల వ్యాప్తికి జయశంకర్ అందించిన మేధోసేవలు, ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన బలం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డా. కె. సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. ఎం. రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. డి. సంధ్య, అధ్యాపకులు ఆర్. మాధవి, డా. బి. గాయత్రి, వి. శ్రీనివాస్, డా. ఆనందరావు, బి. రమేశ్, ప్రకాశ్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



**వర్ధన్నపేట/ఆగస్టు 6(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని గురువారం వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నీళు, నిధులు, నియామకాల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేకల దేవేందర్, గ్రామ కార్యదర్శి షేక్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు, డాక్టర్ సౌమ్య, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రూ.10 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి

## ఇందిరాపార్క్‌లో ఎస్ఎఫ్ఐ మహాధర్నా -కేయూ నుంచి భారీగా తరలిన విద్యార్థులు








**హనుమకొండ/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం మహాధర్నా నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.10 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉంచడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య కొనసాగించలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.
విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపి, పెండింగ్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహాధర్నాలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, కాకతీయ విశ్వవిద్యాలయ కార్యదర్శి జస్వంత్, అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు ఇస్మాయిల్, సాయితేజ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలే తెలంగాణకు మార్గదర్శకం

## కేయూలో ఫొటో గ్యాలరీని సందర్శించిన విశ్వకర్మ పరిషత్ నాయకులు




**హనుమకొండ/ ఆగస్టు 6 (జర్నలిస్ వార్త):** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ హనుమకొండ జిల్లా నాయకులు బుధవారం సందర్శించి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పరిషత్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి దశ నుంచి మలి దశ ఉద్యమం వరకు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్తగా, తెలంగాణ జాతిపితగా చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. విశ్వకర్మ సమాజంలో జన్మించిన ఆయన రాష్ట్ర సాధన కోసం బ్రహ్మచారిగా జీవిస్తూ తన జీవితాన్నే అంకితం చేయడం గర్వకారణమని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలిశోజు బుచ్చిరాములు, హసన్‌పర్తి మండల నాయకులు శ్రావణపల్లి రవీంద్రాచారి, వెలిశోజు సాంబయ్యాచారి, వేదమూర్తి, వెలిశోజు కేదారి, సిద్ధోజు రాంబ్రహ్మం, ఓదెల రాజేంద్రప్రసాద్, ఎం.డి. రాజ్ మహ్మద్, రవీంద్రాచారి తదితరులు పాల్గొని జయశంకర్‌కు నివాళులర్పించారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# బిల్లులు చెల్లింపు.. నీళ్లు మాత్రం లేవు!

### కిష్టారంలో మూతపడిన ఆర్వో ప్లాంట్

### కలుషిత నీటితో ప్రజల ప్రాణాలతో చెలగాటం

### సింగరేణి, డీఎంఎఫ్‌టీ నిధులపై విచారణకు బీజేపీ డిమాండ్





**సత్తుపల్లి/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
సింగరేణి సేఫ్ నిధులతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆర్వో తాగునీటి ప్లాంట్‌కు గుత్తేదారులకు పూర్తి బిల్లులు చెల్లించినా గ్రామ ప్రజలకు మాత్రం చుక్క శుద్ధి నీరు అందడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్లాంట్ ప్రారంభం కాకపోవడంతో సత్తుపల్లి రూరల్ మండలం కిష్టారం గ్రామ ప్రజలు కలుషిత నీటిని తాగుతూ అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
బీజేపీ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో పర్యటించిన జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు మూతపడిన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్లాంట్ నిరుపయోగంగా మారడం వెనుక అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు.
గ్రామ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న అధికార యంత్రాంగం వెంటనే మేల్కొని ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణ మందు పిచికారీ చేయాలని కోరారు.
సింగరేణి సేఫ్ నిధులు, డీఎంఎఫ్‌టీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనాన్ని ఖర్చు చేసి నిర్మించిన ప్లాంట్ ఎందుకు ప్రారంభం కాలేదనే విషయాన్ని బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించకపోతే గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.
కార్యక్రమంలో వేముల లక్ష్మీనారాయణ, మేరుగు శేషగిరి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాలయాపనకే కేకే కమిటీ..!

## ఉద్యమకారుల గుర్తింపులో ప్రభుత్వం విఫలమైందని భాషబోయిన రవీందర్ యాదవ్ ధ్వజం



**హసన్‌పర్తి/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సహాయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భాషబోయిన రవీందర్ యాదవ్ విమర్శించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం పేరుతో ఏర్పాటు చేసిన కేకే కమిటీ కాలయాపనకే పరిమితమైందని ఆరోపించారు.
హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు. కేకే కమిటీ సమావేశాలకు ఉద్యమకారుల సంఘాలను పిలిచి సమస్యలు విన్నప్పటికీ, వాటి పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మండలాలు, జిల్లాల వారీగా ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేసే ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, వారి త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# వానలపై ఆశలు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!

## వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి: శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య




**ఎల్కతుర్తి/ఆగస్టు 6 (జర్నలిస్ వార్త):**
ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం హనుమకొండ జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య సూచించారు. స్థానిక రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ పథకం సహకారంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవడం వల్ల నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన సాగు విధానాలు, ఆరుతడి పంటల ఎంపిక, నీటి సంరక్షణ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించినట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన రైతులు శాస్త్రవేత్తలను ప్రశ్నించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. పున్నం చందర్, ఎ. రోజా, జె. బాబు, ఎన్. అనురిక, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గొడిశాల రాజన్న గౌడ్, కె. రాజయ్య, బచ్చు బాపూరావు, రైతులు వర్దెల్లి అన్నారావు, సామల లింగారెడ్డి, కొమ్మిడి రాజిరెడ్డి, కొమ్మిడి జితేందర్‌రెడ్డి, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి శాఖల సమన్వయమే కీలకం

## అధికారుల పనితీరే పంచాయతీల ప్రగతికి ప్రమాణం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** గ్రామపంచాయతీల అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి మండలాల్లో గురువారం నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధిసామర్థ్య వృద్ధి అంశంపై మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశాల్లో ఆయన పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు.
గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రజలకు మెరుగైన సేవలందింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీల పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమీక్షా సమావేశాల్లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సంబంధిత మండలాల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హాస్టల్‌లోనే ఎమ్మెల్యే రాత్రి బస

## విద్యార్థులతో కలిసి భోజనం.. వసతులపై ఆరా







**దామరచర్ల/ ఆగస్టు 6 (జర్నలిస్ వార్తలు):** దామరచర్ల మండలంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల హాస్టల్‌లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, తాగునీరు, పరిశుభ్రత, వసతి, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి చదువు, హాస్టల్ నిర్వహణ, భోజన నాణ్యత, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని, సమస్యలు తలెత్తకుండా అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి హాస్టల్‌లో అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటన అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి హాస్టల్‌లోనే రాత్రి బస చేశారు. విద్యార్థుల దైనందిన జీవన విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు







**వర్ధన్నపేట/ఆగస్ట్ 6(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, ఉపసర్పంచ్ బొచ్చు జ్యోతి, మాజీ డైరెక్టర్ పొట్లపెల్లి కృష్ణ, మాజీ వార్డు సభ్యుడు పిట్టల రాజు, సీనియర్ నాయకులు శ్రీరాంమోజు యాకంబ్రచారి, తాండ్ర రాజేందర్, బొడ్డుపెల్లి శ్రీకాంత్, రాయపురం సాంబయ్య, మునుకుంట్ల రాము, అనిల్, సిద్ధు, బేతి సాయి తదితరులు పాల్గొన్నారు.

# తీజ్‌లో బంజారా సంబరం

**గోధుమ మొలకలతో సంప్రదాయ వేడుకలు..**

**మహిళలతో కలిసి నృత్యం చేసిన మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్**





**వేలేరు/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** బంజారా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీక అని వేలేరు మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. వేలేరు మండలం కమ్మరిపేట గ్రామ తండాలో జరుపుల, లావుడ్యా, మురావత్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో పెంచిన గోధుమ మొలకల బుట్టలను బంజారా యువతులు, మహిళలు తలపై ధరించి సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ సంప్రదాయ నృత్యంలో పాల్గొని సందడి చేశారు. తీజ్ పండుగ బంజారా సమాజ ఐక్యతకు, వారి సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జోడుముంతల కిరణ్, ఉప సర్పంచ్ సురేష్, కమ్మరిపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జరుపుల రమేష్, లింగయ్య, కార్తీక్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాల్లో కాంగ్రెస్‌కు కొత్త నాయకత్వం






**వర్ధన్నపేట/ఆగస్టు 6(జర్నలిస్ట్ వార్త):** గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో వర్ధన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిర్ణయం, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు గురువారం బండౌతాపురం, కడారిగూడెం, కట్రీయాల, రాంధాన్ తాండా, చంద్రు తాండా గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి నూతన అధ్యక్షులను నియమించారు. బండౌతాపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సినపెల్లి బాబు, కడారిగూడెం అధ్యక్షుడిగా చొల్లేటి రమణరెడ్డి, కట్రీయాల అధ్యక్షుడిగా బండారి సతీష్ గౌడ్, రాంధాన్ తాండా అధ్యక్షుడిగా గుగులోత్ దేవేందర్, చంద్రు తాండా అధ్యక్షుడిగా భూక్యా శ్రీరాములు ఎన్నికయ్యారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్‌రెడ్డి, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్ పాల్గొని నూతన కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ కమిటీలు పార్టీకి బలమైన పునాదిగా నిలవాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, సర్పంచ్ పింగళి నాగమణి, ఉపసర్పంచ్ నాంపెల్లి రవీందర్, రామచంద్రారెడ్డి, తీగల సునీత గౌడ్తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దోమలదే రాజ్యం... అధికారులు ఎక్కడ?

**వర్షాలు మొదలైనా మలేరియా నివారణ చర్యలు గాలిలోనే**

**ఫాగింగ్ జాడలేదు... బ్లీచింగ్ చల్లడానికే పరిమితమైన పంచాయతీలు**

**జ్వరాలతో ప్రజల ఆందోళన... వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్**



**వర్ధన్నపేట/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
వర్షాకాలం ప్రారంభమైనా గ్రామాల్లో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు కనిపించకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో దోమల ఉధృతి రోజురోజుకూ పెరుగుతున్నా ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేలు, ప్రత్యేక పారిశుధ్య చర్యలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు.

గ్రామ పంచాయతీల పరిధిలో మురికి కాలువలు, నిల్వ నీరు దోమల పెంపక కేంద్రాలుగా మారినా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒకట్రెండు సార్లు బ్లీచింగ్ పౌడర్ చల్లడానికే పరిమితమవుతున్నారని, గతంలో తరచూ నిర్వహించిన ఫాగింగ్ కార్యక్రమాలు ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయాయని వారు చెబుతున్నారు.

దోమల బెడద నుంచి తప్పించుకోవడానికి ప్రజలు జెట్ స్ప్రేలు, ఆల్ అవుట్, గుడ్ నైట్ వంటి రిపెలెంట్లపై ఆధారపడుతున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదని అంటున్నారు. మరోవైపు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రజారోగ్య పరిరక్షణలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి గ్రామంలో ప్రత్యేక మలేరియా నివారణ బృందాలను ఏర్పాటు చేసి ఫాగింగ్, శానిటేషన్, యాంటీ లార్వా చర్యలను వెంటనే చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**మలేరియా లక్షణాలు**

చలి వణుకుతో కూడిన జ్వరం
తలనొప్పి, తీవ్రమైన అలసట
వికారం, వాంతులు, అతిసారం
కడుపు, కండరాలు, కీళ్ల నొప్పులు
వేగంగా శ్వాస తీసుకోవడం, గుండె వేగం పెరగడం
కొందరిలో చలిఅధిక జ్వరంచెమటలు అనే చక్రంలా లక్షణాలు కనిపించడం

**జ్వరం మూడు రోజులు కాదు... మూడు గంటలైనా జాగ్రత్తే!**

మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# పేదల రాజ్యాధికార సమితిలో పుష్పరాజ్‌కు కీలక బాధ్యత



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి (టీపీఆర్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మసాగర్ మండలానికి చెందిన కోట్టె పుష్పరాజ్‌ను నియమించారు. ఈ మేరకు సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సింగారం ప్రేమ్‌కుమార్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విద్య మానేసిన విద్యార్థులను తిరిగి చదువులోకి తీసుకురావడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, వివిధ సామాజిక ఉద్యమాల్లో ముందుండి పనిచేయడం వంటి సేవలను గుర్తించి పుష్పరాజ్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు సమితి నాయకత్వం తెలిపింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తున్న ఆయన సేవలు సంస్థ బలోపేతానికి దోహదపడతాయని పేర్కొంది. నియామకంపై కోట్టె పుష్పరాజ్ స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సింగారం ప్రేమ్‌కుమార్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేదల సమస్యల పరిష్కారానికి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అవినీతిపై రాజీలేని పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, పేదల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# తెలంగాణకు దిశానిర్దేశం చేసిన మహనీయులు




**కేసముద్రం/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, ప్రజాకవి గద్దర్ జయంతి వేడుకలను కేసముద్రంలోని శ్రీ వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలే ప్రధాన బలంగా నిలిచాయని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను శాస్త్రీయంగా విశ్లేషించి ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని దేశానికి చాటిచెప్పిన గొప్ప మేధావి జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజాకవి గద్దర్ తన పాటలు, సాహిత్యంతో ఉద్యమ చైతన్యాన్ని ప్రజల్లో రగిలించారని, అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన ప్రజాకళాకారుడిగా చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఆయన గీతాలు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా మారాయని తెలిపారు. విద్యార్థులు ఈ ఇద్దరు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సమాజం పట్ల బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ.. డబ్బా పాలకు దూరంగా ఉండాలి





**నర్సంపేట/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):**
శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం, ద్రవ పదార్థాలు ఇవ్వొద్దని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలోని ఐకేపీమెప్మా కార్యాలయంలో ప్రాజెక్టు సీడీపీఓ మధురిమ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా శిశువుకు ఇవ్వాలని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలే సరిపోతాయని చెప్పారు. సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ ముర్రుపాలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, డబ్బా పాలకు బదులుగా స్వచ్ఛమైన తల్లిపాలనే అందించాలని సూచించారు. ఉద్యోగం లేదా ఇతర కారణాలతో బిడ్డ సంరక్షణను నిర్లక్ష్యం చేయవద్దని, శిశువు ఎదుగుదలలో తల్లి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీ రామోజు రోజారాణి, బాణాల ప్రసన్న, పొన్నాల మనీషా, వీణ, దొంగల రజిత, సూపర్‌వైజర్లు అరుణ, వాసంతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్‌కు ఘన నివాళి



**మహబూబాబాద్/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణలో జయశంకర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# జయశంకర్ ఆశయసాధనే నిజమైన నివాళి



**కేసముద్రం/ ఆగస్టు 6 (జర్నలిస్ వార్త):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వయం ప్రతిపత్తి, సమాన అభివృద్ధి కోసం జయశంకర్ జీవితాంతం పోరాడారని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు నేటికీ తెలంగాణ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. యువత జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జయశంకర్ సేవలను స్మరించుకోవడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు దారావత్ కిషోర్, తరాల వీరేష్ యాదవ్, వల్లందాస్ ఉమా, కనుకుల సుభద్ర, బానోత్ అరుణకుమారి, ఆగే రాము, పైరాల శరత్ యాదవ్, రావుల వినయ్, దూడపాక కృష్ణ, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి మహిళా సంఘం బలోపేతంతో గ్రామీణాభివృద్ధి.

**-ఎంపీడీవో దీపిక.**



**బయ్యారం/,ఆగస్టు 6.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం షిరిడి సాయి గ్రామ సమైక్య మహా జనసభ జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, ఎంపీడీవో దీపిక. హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళా సంఘాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రధాన భాగస్వాములుగా మారాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి మహిళా సంఘం బలోపేతం కావడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అవసరమైన వారికి ఉపాధి కల్పించాల్సిన అవసరముందని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధిస్తే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీ హరి, 25 సంఘాల వివో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.40 కోట్ల గంజాయి దహనం

**32 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 696 కిలోలు**



**తల్లాడ/ ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 32 గంజాయి కేసుల్లో స్వాధీనం చేసుకున్న 696 కిలోల గంజాయిని గురువారం ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. తల్లాడ మండలం గోపాలపేట గ్రామ సమీపంలోని ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ కేంద్రంలో న్యాయస్థాన ఆదేశాలు, నిబంధనల మేరకు ఈ ప్రక్రియ నిర్వహించారు. దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ.1.40 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా స్వాధీనం చేసుకున్న గంజాయిని పూర్తిగా దగ్ధం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీఐలు ప్రసాద్, రాజు, జయశ్రీ, ఎస్ఐ సీతారామరాజుతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. అక్రమ మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

జర్నలిస్ట్ వార్త
శుక్రవారం 7 ఆగస్టు 2026

# మలుపులు

## ప్రేమలో తీసుకున్న ప్రతి నిర్ణయం... జీవితాన్ని కొత్త మలుపులోకి నెడుతుంది.



పచ్చని పొలాలతో నిండిన ఓ గ్రామంలో సిరి అనే అందమైన అమ్మాయి పెరుగుతుంది. చిన్నప్పటి నుంచే తెలివి, అందం, ఆటలంటే ఇష్టం. అదే గ్రామంలో ఉండే రవి అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారుతుంది. ఇద్దరూ కలిసి జీవితాన్ని ఊహించుకుంటారు.

అంతలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సిరి మరో రాష్ట్రానికి వెళుతుంది. అక్కడ కొత్త వాతావరణం, కొత్త స్నేహాలు. ఆ సమయంలో అర్జున్ అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారుతుంది. ఫోన్ కాల్స్, సందేశాలు... చివరకు పెళ్లి వరకు మాట్లాడుకుంటారు.

కానీ గ్రామంలో ఉన్న మొదటి ప్రేమ విషయం కుటుంబానికి తెలుస్తుంది. ఆగ్రహంతో పెద్దలు రవిపై దాడి చేస్తారు. అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి వేధిస్తారు. రవి కుటుంబం అవమానంతో కుంగిపోతుంది.

కాలం గడుస్తుంది.

సిరి తండ్రికి బదిలీ అవుతుంది. కొత్త ఊరు, కొత్త జీవితం. అక్కడ బంధువైన మధుతో పరిచయం ఏర్పడి, ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది. ఇద్దరు కుమారులు పుడతారు.

కానీ పెళ్లి తర్వాత జీవితం మారిపోతుంది.

భర్త అనుమానం, కోపం, చిన్న చిన్న విషయాలకు గొడవలు, శారీరక హింస. ఎన్నిసార్లు కుటుంబ సభ్యులు సర్దిచెప్పినా ప్రయోజనం ఉండదు. పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిన సంఘటనల తర్వాత కూడా సంసారం నిలబడదు.

ఈ అవమానాన్ని మనసులో పెట్టుకున్న మధు, సిరిని ఆమె కుటుంబానికి దూరం చేయడానికి ప్రయత్నిస్తాడు. కుటుంబ సభ్యులపై కేసులు పెట్టించే వరకు పరిస్థితి దిగజారుతుంది.

కొంతకాలానికి ఉద్యోగరీత్యా మరో ప్రాంతానికి వెళ్లిన కుటుంబం అక్కడ స్థిరపడుతుంది. పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చేరతారు.

ఒంటరితనం... ప్రేమ కోసం తపన...

ఆ పాఠశాలలోని పీటీ టీచర్ విక్రమ్ ప్రేమగా మాట్లాడుతాడు. ఆ మాటల్లో సిరి తనకు దొరకని ఆప్యాయతను వెతుక్కుంటుంది. ఇద్దరి మధ్య అనుబంధం పెరుగుతుంది.

ఒక రోజు ఒక మెసేజ్...

ఆ మెసేజ్ చిన్న కుమారుడి చేతిలో ఉన్న ఫోన్‌లో కనిపిస్తుంది.

అంతే...

భర్తకు నిజం తెలుస్తుంది. కోపంతో సిరిని కొడతాడు. వారి సంభాషణలను రికార్డు చేసి పోలీస్ స్టేషన్‌కు వెళ్తాడు. సిరి తన స్నేహితుడిని రక్షించేందుకు ప్రయత్నించినా కుటుంబం పూర్తిగా విరిగిపోతుంది.

చివరకు సిరి పుట్టింటికి చేరుతుంది. అప్పటికే అన్న లేడు. తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. అక్క, తమ్ముడు తమ తమ జీవితాల్లో ఉన్నా కుటుంబం మునుపటి ఆనందాన్ని కోల్పోయింది. తల్లిదండ్రులు ఆమె తప్పులను గుర్తించి మళ్లీ కాపురం చేయమని ప్రయత్నిస్తారు. కానీ భర్త తిరస్కరిస్తాడు.

జీవితం మళ్లీ కొత్త మలుపు తిరుగుతుంది.

ఉపాధి కోసం ఒక గ్రామంలో ఉద్యోగం చేస్తున్న సిరికి అక్కడ శేఖర్ అనే స్థానిక ప్రభావశీలుడితో పరిచయం ఏర్పడుతుంది. అతడు ప్రేమ, భరోసా పేరుతో దగ్గరవుతాడు. సిరి తన దగ్గరున్న డబ్బు, బంగారం, నమ్మకం అన్నీ అతనికి అర్పిస్తుంది.

కొంతకాలానికి డబ్బు అవసరం రావడంతో చిన్ననాటి పరిచయస్తుడు రవికి ఫోన్ చేస్తుంది. సహాయం అడుగుతుంది. పాత పరిచయంతో అతను సహాయం చేస్తాడు.

కొన్ని రోజుల తర్వాత సిరి జీవితంలోని నిజాలు రవికి తెలుస్తాయి.

ఒక రోజు ఆమెను కలిసి ఇలా అంటాడు.

ప్రేమ తప్పు కాదు... కానీ ప్రతి ఆకర్షణను ప్రేమ అనుకుంటే చివరకు మనిషి తనను తానే కోల్పోతాడు. నీ జీవితాన్ని మార్చుకో. ఇక నుంచి నిజంగా బ్రతుకు.

ఆ మాటలు సిరి గుండెల్లో మారుమోగుతాయి.

ఆమె తన జీవితాన్ని వెనక్కి తిరిగి చూస్తుంది.

చిన్ననాటి ప్రేమ...రెండో ప్రేమ...పెళ్లి... కుటుంబం... అన్న మరణం...తల్లిదండ్రుల కన్నీళ్లు...అనుమానం... మూడో సంబంధం...నాలుగో మోసం...

అన్నీ కళ్ల ముందు తిరుగుతాయి.

అదే సమయంలో ఒక బంధువు యువకుడు ఆమెను ఇష్టపడుతున్నానని చెబుతాడు.

ఈసారి సిరి చిరునవ్వుతో ఇలా అంటుంది.

ప్రేమకు కాదు... ఇప్పుడు నాకు ప్రశాంతతకు విలువ ఎక్కువ. ఇంకెవరినీ మోసం చేయను... నన్ను నేనే మోసం చేసుకోను.

ఆమె స్వయంగా ఉద్యోగం చేస్తూ, తన పిల్లల భవిష్యత్తు కోసం జీవించడం ప్రారంభిస్తుంది.

ఈ సంఘటనలతో సిరి కుటుంబం కూడా మానసికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. సిరికి ఒక అన్న, ఒక తమ్ముడు, ఒక అక్క ఉంటారు. కుటుంబంలో అందరినీ ఒక్కటిగా ఉంచే పెద్ద కొడుకు అయిన అన్న, కొంతకాలానికే అనారోగ్యానికి గురవుతాడు. ఎంత చికిత్స చేసినా ప్రాణాలు దక్కవు. అతని మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెడుతుంది.

పెద్ద కొడుకును కోల్పోయిన బాధను తట్టుకోలేక తల్లి, తండ్రులు మానసికంగా కుంగిపోతారు. వయసు పైబడటంతో అనారోగ్యాలు వెంటాడుతాయి. ఒకప్పుడు ఆనందంగా కళకళలాడిన ఆ ఇల్లు నిశ్శబ్దంగా మారిపోతుంది. పిల్లలు బతికుండగానే వారి కళ్లలో కన్నీళ్లు, గుండెల్లో బాధ మాత్రమే మిగులుతుంది.

**క్లైమాక్స్**

చివరి సన్నివేశంలో మహిళల సమావేశంలో సిరి ఇలా చెబుతుంది.

జీవితంలో ప్రేమ ఒక్కటే కాదు. ఆకర్షణ శాశ్వతం కాదు. నిర్ణయం తీసుకునే ముందు ఒక్కసారి ఆలోచిస్తే... ఎన్నో కుటుంబాలు కాపాడవచ్చు. మన నిర్ణయాలు మన జీవితాన్నే కాదు, మన తల్లిదండ్రుల ఆనందాన్ని, మన పిల్లల భవిష్యత్తును, మన కుటుంబ ప్రశాంతతను కూడా ప్రభావితం చేస్తాయి.

కెమెరా ఆమె ఇద్దరు కుమారులపైకి వెళ్తుంది. వారు తల్లిని గౌరవంగా చూస్తుంటారు.

స్క్రీన్ నెమ్మదిగా నలుపు రంగులోకి మారుతుంది. అందం కాలంతో మారిపోతుంది. ఆకర్షణ క్షణాల్లో మాయమవుతుంది. కానీ నమ్మకం, బాధ్యత, కుటుంబ విలువలు నిలిచిపోతాయి. తప్పు తెలుసుకుని మారితే... జీవితం మళ్లీ కొత్త మలుపు తిరుగుతుంది.

**ధీ హెండ్**

## జయశంకర్ ఆశయాలే తెలంగాణకు దిక్సూచి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని ఎల్కుర్తి గ్రామ సర్పంచ్ నరిశెట్టి సుధాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని నూతనంగా నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ గ్రామాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, కొలిపాక రమేష్ , కార్యదర్శి భీమ్ రాజు, డాక్టర్ అలేఖ్య వార్డు సభ్యులు, మాదాసి కుమారస్వామి, కొలిపాక కొమురయ్య, కొలిపాక స్వామి, జనార్ధన్, కొలిపాక సురేష్, విజేందర్, ఇంద ప్రభాకర్ మపంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది, రేషన్ డీలర్, గ్రామైక్య సంఘ సభ్యులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్లు, ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యువజన సంఘాల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు ఉత్తమ ఆహారం





**కేసముద్రం/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే తొలి రక్షణ అని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రేకులతండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదల సాధ్యమవుతుందని చెప్పారు. తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం ఇవ్వకూడదని సూచించారు. డబ్బా పాలు వద్దు. తల్లిపాలే ముద్దు అనే సందేశాన్ని ప్రతి తల్లి ఆచరించాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుతో పాటు తల్లి ఆరోగ్యానికీ మేలు జరుగుతుందని, ప్రసవానంతర సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు.

కార్యక్రమం అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్నను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ కమలాదేవి, సెక్టార్ సూపర్వైజర్ సర్దార్ బి, అంగన్‌వాడీ టీచర్లు దుర్గ, రమణ, సరోజినీదేవి, రామజమా, సుజాత, కవిత, స్నేహ, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## కేజీబీవీ కొత్త భవనం ప్రారంభానికి గడువు..

### 15 రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశం



**కేసముద్రం/ఆగస్టు 6 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనాన్ని 15 రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జీఈసీఓ గాయత్రితో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీతో ఫోన్‌లో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌కు అవసరమైన డీడీని రెండు రోజుల్లో అందజేస్తామని తెలిపారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి, ఏఎన్ఎంకు సూచించారు. సీఆర్టీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మాధ్యమంలో బోధనకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఐఎఫ్‌బీ ప్యానెల్స్, డిజిటల్ విద్యా వనరులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లు పెంచడంతో పాటు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి డిజిటల్ అభ్యాస కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

జీఈసీఓ గాయత్రి మాట్లాడుతూ బేస్‌లైన్ పరీక్షలు, ఎఫ్ఏ1 మూల్యాంకనాలను నిబంధనల ప్రకారం నిర్వహించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వార్షిక, పాఠ్య, పీరియడ్ ప్రణాళికలను రూపొందించి పాఠశాల అంతర్గత పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలని తెలిపారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి అర్చన, సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు పాల్గొన్నారు.



## గిరిజన సంస్కృతికి ప్రతీకగా తీజ్ వేడుకలు

**కేసముద్రం/ఆగస్టు 6 (జర్నలిస్ వార్త):** గిరిజనుల ఆచార సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీలో గురువారం వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీజ్ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకలకు జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమారవి, 12వ వార్డు కౌన్సిలర్ వీరేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు సమాజానికి విలువైన వారసత్వమని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తీజ్ పండుగ ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కనుకుల రాంబాబు, శ్రీరామ్ కిరణ్, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, అజ్మీర్ దీప్లా, అజ్మీర్ రమేష్, భానోత్ కిషన్, చిట్ట సంపత్, అజ్మీర్ రాజుతో పాటు కాలనీ పెద్దలు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీజ్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.



## కాచనపల్లి గ్రామస్తుల సామూహిక వనభోజనాలు.

### -సర్పంచ్ యలం రేవతి.



**బయ్యారం/,ఆగస్టు 6.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కాచనపల్లి పంచాయతీలో ఆషాఢ మాసంలో గిరిజనుల వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించుకున్నారు. గిరిజన గ్రామాల్లో జరిగే సామూహిక విందు, పూజలు,ఐక్యతకు ప్రతీకగా చేసే ఆచారం అని సర్పంచ్ యలం రేవతి అన్నారు. సామూహిక వనభోజనంలో గ్రామస్థులు పిల్లలతో కలిసి గ్రామ శివారులోని అడవుల్లో కూర్చొని రకరకాల పిండివంటలు తయారు చేసి భోజనం చేస్తామని,అందరూ తమ ఇళ్లలో వండిన వంటకాలను ఒకచోట చేర్చి, ముందుగా దేవతలకు నైవేద్యం పెట్టి వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండి రైతులు అభివృద్ధి లోకి రావాలని ప్రత్యేక పూజలు చేసిన తర్వాత అందరూ కలిసి తింటామని సర్పంచ్ తెలిపారు. వ్యవసాయానికి,గ్రామానికి, ఆరోగ్యానికి నష్టం జరగకుండా ఉండేందుకు పూర్వీకుల కాలం నుంచి ఈ ఆచారాన్ని పాటిస్తున్నాట్లు గ్రామస్తులు తెలిపారు. వనభోజనాలు గిరిజనుల ఐక్యతకు, సంప్రదాయాల పరిరక్షణకు గుర్తుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

